క్లుప్తంగా

శనైశ్చరునికి పూజలు, తైలాభిషేకాలు



మందపల్లి శనైశ్చరాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. శనికి ప్రీతికరమైన శనివారం పురస్కరించుకుని దేవదాయ, ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రాతః కాల సమయంలో ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాల టిక్కెట్ల ద్వారా దేవస్థానానికి రూ 1,61,545, అన్న ప్రసాదం విరాళాలు రూపంలో రూ 70,832తో మొత్తం రూ.2,32,377 ఆదాయం వచ్చినట్టు ఏసీ, ఈఓ విజయలక్ష్మి తెలిపారు.

వేంకటేశ్వరుని ఆలయానికి భక్తుల రద్దీ



స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువు గ్రామంలో వేంచేసిన అలివేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేద పండితులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేద పండితులు స్వామికి తులసీ పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామివారికి పటిక బెల్లం మొక్కుబడి చెల్లించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

గోశాలకు దాణా వితరణ



గోశాల వద్ద దాణాను ఏసీ సమక్షంలో అందజేస్తున్న దాత

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలోని గోశాలకు మలికిపురానికి చెందిన విష్ణుభట్ల సుందర్రావు, సుబ్రహ్మణ్యం రూ.2 వేల విలువ చేసే 100 కేజీల దాణాను శనివారం వితరణ చేశారు. ఈ మేరకు గోశాల వద్ద అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో సిబ్బందికి అందజేశారు. సేవా బృందం సభ్యులు గునెశెట్టి శివ, రావి ప్రసాద్, నల్లా ప్రసాద్, జె.మాణిక్యాలరావు పాల్గొన్నారు.

తాగునీటి ప్రాజెక్టును పరిశీలించిన డీఈ



ప్రాజెక్ట్ పనులను పరిశీలిస్తున్న డీఈ రాజన్

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం గ్రామంలో జేజేఎంలో రూ.17.33 కోట్ల వ్యయంతో రూపుదిద్దుకుంటున్న భారీ తాగునీటి ప్రాజెక్ట్ పనులను శనివారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఏవీఎస్ రాజన్ పరిశీలించారు. చెరువులో నిల్వ చేసే నీరు ఇంకిపోకుండా ఉండేందుకు బెడ్ కార్పెట్‌గా 70 సెం.మీ. ఎత్తులో నల్లరాగడి వేసే పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ మేరకు బెడ్ కార్పెట్ పనులపై ఆయన జేఈ కె.లక్ష్మీ శిరీషతో చర్చించారు. పనులను వేగవంతం చేసి, త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేస్తామని డీఈ రాజన్ తెలిపారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు ఉన్నారు.

వివాహిత ఆత్మహత్య

మామిడికుదురు: పాశర్లపూడి గ్రామానికి చెందిన కడలి లక్ష్మీదుర్గ (33) శనివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుందని నగరం ఎస్సై పి.సురేష్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం, పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం సమీపంలోని వెంప గ్రామానికి చెందిన లక్ష్మీదుర్గకు పాశర్లపూడికి చెందిన బొక్కా దుర్గామహేష్‌తో 2014లో వివాహం జరిగింది. చెన్నైలో దుర్గామహేష్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. భీమవరం పాలిటెక్నిక్ కళాశాలలో లక్ష్మీదుర్గ ల్యాబ్ అసిస్టెంట్‌గా పనిచేసేది. భార్యాభర్తల మధ్య మూడేళ్ల నుంచి గొడవలు ఉన్నాయి. దీంతో ఆమె వెంపలో పుట్టింటి వద్ద ఉంటుంది. ఈ నెల 13న వీరి వివాదాలను పరిష్కరించి లక్ష్మీదుర్గను ఆమె తండ్రి పాశర్లపూడి తీసుకువచ్చి అత్తింటి వారి వద్ద విడిచి వెళ్లాడు. కాపురానికి చెన్నై తీసుకు వెళతానని భర్త చెప్పినప్పటికీ, ఆమె ఇష్టపడలేదు. ఈ నేపథ్యంలోనే లక్ష్మీదుర్గ ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె తండ్రి సీతాపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నాణ్యతకు నీళ్లు

ప్రకృతి ప్రసాదించిన గాలి, నీరు, నేల.. ఇవన్నీ మానవునికి వరాలే. అన్నీ స్వచ్ఛమైనవి, శుద్ధమైనవే. తమ స్వార్థ ప్రయోజనాల కోసం మనిషి వీటిని కలుషితం చేసి.. ప్రపంచ మనుగడే ప్రశ్నార్థకంగా మార్చేశాడు. తాగే మంచినీటి కోసం ఆధారపడిన నదులు, చెరువులూ కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. ఈ నేపథ్యంలోనే ప్రజలు స్వచ్ఛమైన, శుద్ధమైన తాగునీటి కోసం మినరల్ ఆర్‌ఓ ప్లాంట్లను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇప్పుడు అవి కూడా కల్తీకి చిరునామాగా మారిపోతున్నాయి. తూతూమంత్రంగా శుద్ధి చేసిన నీటిలో.. కొన్ని రసాయనాలు కలిపి.. జనాలకు విక్రయించేస్తున్నారు. తమ జేబులు నింపుకోవడానికి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

- అనుమతి లేకుండా ఆర్వో ప్లాంట్లు
- తనిఖీలు చేయని అధికారులు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

అంబాజీపేట: నీరు ప్రాణాధారం. అందుకే శుద్ధ జలాల కోసం ప్రజలు ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. తాగునీటి కోసం శుద్ధజలాల(ఫిల్టర్ వాటర్)పై ఆధారపడాల్సి వస్తోంది. పేద, మధ్య తరగతి ప్రజలు ఫిల్టర్ వాటర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి రూ.10 నుంచి రూ.15 వెచ్చించి మంచినీరు కొనుగోలు చేస్తున్నారు. ఇదే అదనుగా వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు నాణ్యతకు తిలోదకాలిచ్చి, సంపాదనే ధ్యేయంగా విచ్చలవిడిగా నీటి విక్రయాలు చేస్తున్నారు.

పి.గన్నవరం, కొత్తపేట, రాజోలు నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో సుమారుగా 130కి పైగా వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో అన్ని రకాల అనుమతులు పొందిన ప్లాంట్లు 35 శాతమే. ఐఎస్ఐ అనుమతులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఖర్చు చేయాలి. మూడు నెలలకోసారి ఉన్నత స్థాయి అధికారులు తనిఖీ చేయాలి. గడువు ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకోవడానికి మళ్లీ రూ.2 లక్షలు ఖర్చవుతుంది. చాలా మంది బోరు వేసి, అందులో నీళ్లు పడితే చాలు రూ.2.50 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఖర్చు చేసి, ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసేస్తున్నారు. అంతేకాదు, క్యాన్లు, ట్యాంకులను శుభ్రం చేయకుండానే నీరు సరఫరా చేస్తూ.. అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

నిబంధనలకు తిలోదకాలు

నీటిలో సాయిల్, ఐరన్, యాసిడ్, క్లోరిన్, క్లోరైడ్ వంటి ఆమ్లాలు, లోహ పదార్థాలు ఉంటాయి. ఇవి అవసరమైన దాని కంటే ఎక్కువ మోతాదులో ఉంటే ప్రజారోగ్యానికి ముప్పు తప్పదు. ప్లాంట్‌లో కచ్చితంగా కెమికల్ అనాలసిస్ ల్యాబ్ ఏర్పాటు చేసి, కెమిస్ట్, మైక్రో బయాలజిస్టులను నియమించాలి. వీరు ఫిల్టర్ చేసే ముందు నీటిని పరీక్షించాల్సి ఉంటుంది. ఫిల్టర్ అయ్యాక నీటిలోని కాఠిన్యత, లవణాలు, రంగు, రుచి పరీక్షించిన తర్వాతే విక్రయానికి పంపించాలి. ఇవేమీ జరగకుండా లేదు. బోరు నీటిని ఫిల్టర్ చేశాక, వాసన లేకుండా, రుచి తెలియకుండా రసాయనాలు కలుపుతున్నారు, ఫలితంగా మినరల్స్ పూర్తిగా పోతున్నాయి. ఈ నీటిని తాగిన జనానికి రోగ నిరోధక శక్తి తగ్గి, క్యాల్షియం కోల్పోయి.. మోకాళ్ల నొప్పులతో ఇబ్బందులు పడుతున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇటువంటి నీటిని ప్రజలకు విక్రయించి కొందరు ప్లాంట్ల నిర్వాహకులు లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు.



అంబాజీపేటలో విక్రయానికి సిద్ధంగా ఉన్న వాటర్ ప్లాంట్‌లోని టిన్నులు

చర్యలు చేపడతాం



అనుమతులు పొందకుండా ఆర్వో ప్లాంట్లను నిర్వహిస్తే చర్యలు చేపడతాం. ఆర్వో ప్లాంట్ల నిర్వాహకులతో సమావేశం నిర్వహిస్తాం. నీటి శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపిస్తాం. నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయి. నిబంధనలకు విరుద్ధంగా నడిపే ప్లాంట్లను సీజ్ చేస్తాం.

– జీవీ సరోవర్, ఎంపీడీఓ, అంబాజీపేట

రోడ్డు ఆధునీకరణకు ఎమ్మెల్యే భూమిపూజ

పి.గన్నవరం: సీఆర్ఎఫ్ నిధులు రూ.8 కోట్ల వ్యయంతో అంబాజీపేట-పి.గన్నవరం ఆర్‌అండ్‌బీ రహదారి ఆధునీకరణ పనులకు ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం భూమిపూజ చేశారు. అలాగే స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ నుంచి అక్విడెక్టు వరకూ ఆర్‌పీ రోడ్డు ఆధునీకరణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గిడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, డొక్కా నాథ్‌బాబు, గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పి.గన్నవరంలో ఏజీ రోడ్డు ఆధునీకరణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

‘విద్యా ప్రవేశ్’ను విజయవంతం చేయాలి

సమగ్ర శిక్షా ఏపీసీ మధుసూదనరావు

కొత్తపేట: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న విద్యాప్రవేశ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిప్యూటీ కలెక్టర్, సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) ఎ.మధుసూదనరావు ఉపాధ్యాయులకు సూచించారు. వాడపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన సందర్శించి, నాడు-నేడు పనులను పరిశీలించారు. ఆయా పాఠశాలలు, మండలంలో పాఠశాలల పనుల పురోగతిపై ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్, హెచ్ఎంలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 1,240 ప్రాథమిక, 86 ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఒకటో తరగతి విద్యార్థులకు 90 రోజులు పాటు విద్యాప్రవేశ్ కార్యక్రమం అమలు చేయాలన్నారు. రోజువారీ షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలను అంకితభావంతో అమలు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం బడి ఈడు చిన్నారులు స్కూళ్లలో ఉండేలా రాష్ట్ర విద్యా శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ‘నేను బడికి పోతా’ అనే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. ఈ నెల 19వ తేదీ వరకూ ఈ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాల పరిధిలో నిర్వహించాల్సి ఉందన్నారు. అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని సూచించారు. అందుబాటులో ఉన్న నిధుల మేరకు పనులను పూర్తి చేయాలని ఆయా పాఠశాలల హెచ్ఎంలకు సూచించారు.



వాడపాలెంలో నాడు-నేడు పనులపై ఎంఈఓ హరిప్రసాద్‌తో సమీక్షిస్తున్న మధుసూదనరావు

రుణాల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

తహసీల్దార్‌కు రైతుల వినతి

ఆలమూరు: మండలంలోని నర్సిపూడిలో రుణ అర్హత కార్డుల్లో అక్రమాలు, వ్యవసాయ రుణాల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన రైతులు శనివారం తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వివరాల్లోకి వెళితే, 2018-20 మధ్య కాలంలో సొంత భూమి రైతుల అనుమతి లేకుండా అప్పటి వీఆర్‌ఓ దారా సుదర్శన్ ఇష్టానుసారం రుణ అర్హత కార్డులను పంపిణీ చేశారు, ఆ కార్డులతో స్థానిక శ్రీచైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రూ.లక్షల్లో రుణాలు తీసుకుని, చెల్లించడం మానేశారు. ఇటీవల కాలంలో కొంతమంది రైతులు తమ భూమిపై రుణాలు ఇవ్వాలంటూ సొసైటీల వద్దకు వెళ్లగా, ఈ బాగోతం బయట పడింది. దీనిపై సంబంధిత బ్యాంకు అధికారులను ప్రశ్నించినా ఫలితం లేకపోవడంతో.. రైతులు ఆలమూరు వచ్చి వీఆర్‌ఓ సుదర్శన్‌పై తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన తహసీల్దార్ అనిల్‌కుమార్ రుణ అర్హత కార్డుల్లో అక్రమాలు జరిగాయని నిర్ధారించారు. ఈ మేరకు వీఆర్‌ఓ సుదర్శన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణకు నివేదిక ఇచ్చారు. సొంతభూమి కలిగిన రైతులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఏఎంసీ మాజీ చైర్మన్ దునే స్వామినాయుడు, జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘ మాజీ అధ్యక్షుడు గట్టి రామారావు, బీజేపీ నేత వడ్డి దొరయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు తప్పనిసరి

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల ఉప కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది శనివారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి, డి.మల్లికార్జున్, డి.సాయికిషోర్ ఆధ్వర్యంలో ఆలమూరు-1, ఆలమూరు-2, పెనికేరు, పినపళ్ల, సూర్యారావుపేట, జొన్నాడ శివారు మూలాటి రేవు, చొప్పెల్ల శివారు శ్రీరామ్‌నగర్ కాలనీ, మడికి శివారు మల్లవానితోట, మూలస్థాన అగ్రహారం, గుమ్మిలేరు గ్రామాల్లో అనేక మంది చిన్నారులకు ఆరోగ్య, ఆశా, అంగన్‌వాడీ సిబ్బంది టీకాలను వేశారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణుల సంపూర్ణ ఆరోగ్యానికి టీకాలు తప్పనిసరి అని వైద్యాధికారులు తెలిపారు. ఈ టీకాల ప్రక్రియను సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు పి.శివప్రసాద్, ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, ఆర్, బాలామణి పర్యవేక్షించారు. చిన్నారులకు ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు పెంటావాలెంట్, ఎంఆర్, టీటీ, డీపీటీ, హైపటైటిస్-బి వ్యాక్సిన్లను అందజేశారు.



పెనికేరులో చిన్నారులకు టీకాలను అందిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

నాణ్యమైన భోజనం అందించాలి

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు రుచికరంగా, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంఈఓ-2 మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట నాగాబత్తులవారిపాలెంలో ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ వంట చేసే ప్రాంతమంతా పరిశుభ్రంగా ఉంచాలని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వివరించారు. స్కూలు కిట్లను ప్రతి విద్యార్థికి అందజేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, షూలు, సాక్స్‌లను ఇప్పటికే పాఠశాలలకు అందజేశామన్నారు. కొత్తగా చేరే విద్యార్థులకు పుస్తకాలతో పాటు, త్వరలో యూనిఫారం, స్కూల్ బ్యాగ్‌ను అందించనున్నట్టు తెలిపారు.

వేతనం చెల్లించాలని బీఎల్‌ఓల వినతి

మామిడికుదురు: ఎన్నికల విధుల్లో పాల్గొన్న బూత్ లెవెల్ అధికారులకు చెల్లించాల్సిన వేతనం నాలుగేళ్లుగా ఎన్నికల సంఘం చెల్లించటం లేదని బీఎల్‌ఓలు వాపోయారు. దీనిపై శనివారం తహసీల్దార్ మెరికమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఓటరు జాబితా తయారీలో భాగంగా నూతన ఓటర్ల నమోదు, మృతి చెందిన వారు, వలస వెళ్లిన ఓటర్ల తొలగింపు, ప్రత్యేక కార్యక్రమాలు, ఇంటింటా సర్వే, ఓటరు స్లిప్పుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన వంటి కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఏడాదికి రూ.ఆరు వేల వంతున నాలుగేళ్లకు రూ.24 వేలు చెల్లించాల్సి ఉందన్నారు. ఎన్నికల రోజున విధుల్లో పాల్గొన్నందుకు రూ.500, ఇంటింటా సందర్శనానికి రూ.వెయ్యి వంతున చెల్లించాల్సి ఉందన్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి, తమకు రావాల్సిన వేతనం, పారితోషికం చెల్లించాలని కోరారు. బీఎల్‌ఓల ప్రతినిధులు టి.శ్రావణి, కె.సత్యలత, వి.రోజా, సీహెచ్ మనీషా, జె.ఫాతిమా, ఎన్.సుధీర్, ఎం.సుభాష్, కె.ప్రవీణ్, కె.వినయ్‌కుమార్ ఉన్నారు.



మామిడికుదురు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఎల్‌ఓలు

కండక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా

రాజోలు: ఆర్టీసీ బస్సు ప్రమాదంలో మృతి చెందిన కండక్టర్ కె.శ్రీనివాసరావు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ శనివారం రాజోలు ఆర్టీసీ డిపో ఎదుట యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మే 14న పి.గన్నవరం మండలం ఊడిమూడిలో జరిగిన ఆర్టీసీ బస్సు ప్రమాదంలో చనిపోయిన ఆరుగురిలో కండక్టర్ శ్రీనివాసరావు కూడా ఉన్నారన్నారు. మృతుడు శ్రీనివాసరావు కుటుంబానికి సంస్థ ద్వారా అన్ని ఆర్థిక ప్రయోజనాలను తక్షణం చెల్లించడంతో పాటు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఏఎస్ నారాయణ మాట్లాడుతూ ప్రమాదాలకు కారణమవుతున్న డబుల్ డ్యూటీ విధానాలను రద్దు చేయాలన్నారు. డ్రైవర్ల రిక్రూట్‌మెంట్ చేపట్టాలని, ఈహెచ్ఎస్ నుంచి మినహాయించి రిఫరల్ వైద్య సదుపాయం కల్పించాలని కోరారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని తొమ్మిది ఆర్టీసీ డిపోలకు చెందిన యూనియన్ నాయకులతో పాటు, సంఘ ప్రతినిధులు వి.గణపతి, బీఆర్‌కే కుమారి, కేఎస్‌పీ రావు తదితరులు పాల్గొన్నారు.



రాజోలు ఆర్టీసీ డిపో వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

గణపతిరావు సేవలు చిరస్మరణీయం

మామిడికుదురు: నగరం మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు నియోజకవర్గ అభివృద్ధి చేసిన సేవలు చిరస్మరణీయమైనవని పలువురు వక్తలు కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే దివంగత నీతిపూడి గణపతిరావు 24వ వర్ధంతిని పురస్కరించుకుని నగరం గ్రామంలోని మూడు ప్రాంతాల్లో ఉన్న విగ్రహాలకు స్థానికులు శనివారం పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. గణపతిరావు చేసిన సేవలను ప్రస్తుతించారు. అన్ని వర్గాలకు సమాన న్యాయం జరగాలన్న లక్ష్యంతో ఆయన పని చేశారన్నారు. కుల మతాలకు, పార్టీలకు అతీతంగా నియోజకవర్గాన్ని తీర్చిదిద్దారని, ప్రజా సమస్యలపై తనదైన శైలిలో గళం విప్పారని చెప్పారు. కార్యక్రమంలో ఆయన మనవడు నీతిపూడి గణపతిరావు, ఆర్.మధు, ఎస్.శంకర్, జి.హర్షిత్, కె.ప్రశాంత్, ఎస్.స్టాలిన్‌బాబు, కె.శ్రీను, కె.పండు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నీతిపూడి, శ్రీశ్రీకి నివాళులు

పి.గన్నవరం: మాజీ ఎమ్మెల్యే నీతిపూడి గణపతిరావు నియోజకవర్గ ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర మాలల జేఏసీ కో-కన్వీనర్ కోట రామ్మోహన్‌రావు అన్నారు. స్థానిక అక్విడెక్టు వద్ద శనివారం నీతిపూడి, మహాకవి శ్రీశ్రీల వర్ధంతి కార్యక్రమాలను ఆయన ఆధ్వర్యంలో నిర్వహించారు. వారి చిత్రపటాలకు నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, నాయకులు పాల్గొన్నారు.



నగరంలో మాజీ ఎమ్మెల్యే గణపతిరావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న స్థానికులు

ప్రతి విద్యార్థికి కిట్లు చేరాలి

ఎస్సీఈఆర్టీ అబ్జర్వర్ మాధవీలత

అంబాజీపేట: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే ప్రతి విద్యార్థికి స్టూడెంట్ కిట్లు చేరేలా ప్రణాళిక అమలు చేసినట్టు ఎస్సీఈఆర్టీ (స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్) అబ్జర్వర్ మాధవీలత అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్టాక్ పాయింట్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా స్టాక్ పాయింట్‌కు సంబంధించిన పుస్తకాలు, నోట్ పుస్తకాలు, టైలు, బెల్ట్‌లు, షూలు, సాక్సులు, తదితర వాటి రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి మండలంలో ఈ నెల 13న స్కూళ్ల ప్రారంభానికి ముందుగానే ఆయా పాఠశాలలకు పుస్తకాలు సరఫరా చేసి, విద్యార్థులకు పంపిణీ చేశారన్నారు. ఏడో తరగతికి సంబంధించి ఒక్క పాఠ్యపుస్తకం పంపిణీ కాలేదన్నారు. ఈ నెల 22వ తేదీలోగా ఏడో తరగతి పాఠ్య పుస్తకాలతో పాటు, మిగిలిన విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, షూలు, నోట్ పుస్తకాలు, బెల్ట్‌లు తదితర సామగ్రి రెండో విడత పంపనున్నామన్నారు. అన్ని సబ్జెక్టులకు సంబంధించిన టీచర్ల కాపీ పంపిణీ చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరారు. దీనిపై ఆమె స్పందించి త్వరలో పంపుతామని చెప్పారు. ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిట్ల స్టాక్ పాయింట్ పరిశీలన

రావులపాలెం: మండలంలోని విద్యార్థి కిట్ల స్టాక్ పాయింట్ ఉన్న స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను అబ్జర్వర్ మాధవీలత సందర్శించారు. మండలానికి వచ్చిన స్టాక్, నోట్, పాఠ్య పుస్తకాలు, బెల్టులు, బూట్ల నాణ్యతను పరిశీలించారు. వాటిని పాఠశాలలకు పంపించడం, విద్యార్థులకు పంపిణీ చేయడం తదితర విషయాలపై ఆరా తీశారు. అలాగే రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట జిల్లా మొబలైజేషన్ అధికారి బీవీ సుబ్రహ్మణ్యం, ఎంఈఓ-2 బి.శ్రీనివాసరాజు ఉన్నారు.

పాఠశాలలకు పుస్తకాల పంపిణీ

మలికిపురం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వం మంజూరు చేసిన విద్యార్థి కిట్లను తరలించారు. శనివారం స్టాక్ పాయింట్ నుంచి మండలానికి 4,438 మంది విద్యార్థుల కిట్లను పంపించారు. యూనిఫారం, బ్యాగులు మినహా బెల్టులు, షూస్, నోట్, పాఠ్య పుస్తకాలు అందులో ఉన్నాయి. మండలంలో మొత్తం 78 పాఠశాలలకు వాహనాల ద్వారా వాటిని తరలించారు. ఎంఈఓలు విజయశ్రీ, వైవీవీ సత్యనారాయణ పర్యవేక్షించారు.



అంబాజీపేటలో రికార్డులను పరిశీలిస్తున్న అబ్జర్వర్ మాధవీలత

హోం మంత్రిని కలిసిన ఏలూరు రేంజ్ ఐజీ



సఖినేటిపల్లిలంకలో మంత్రి అనితకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

సఖినేటిపల్లి: రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనితను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్వేది పుణ్యక్షేత్ర పర్యటనలో భాగంగా సఖినేటిపల్లిలంకకు వచ్చిన మంత్రి అనితను ఐజీ కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఆయన వెంట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఖాదర్‌బాషా, కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ ఉన్నారు.

మంత్రి అనితకు అభినందనలు

అంబాజీపేట: హోం మంత్రి వంగలపూడి అనితను సఖినేటిపల్లిలో టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వహణ కార్యదర్శి పెదపూడి శ్రీనివాసరావు, నాయకుడు మంద రాజేష్ మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. ఆమెకు పుష్పగుచ్ఛం, దుశ్శాలువాతో సత్కరించారు.

జెడ్పీ చైర్మన్‌కు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



రామారావుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి

మామిడికుదురు: సోదర వియోగంతో బాధపడుతున్న జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి శనివారం పరామర్శించారు. జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు సోదరుడు విప్పర్తి రామారావు గుండెపోటుతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరీదేవి ధవళేశ్వరంలోని జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావును పరామర్శించి, రామారావు కుటుంబానికి సానుభూతి తెలిపారు. రామారావు చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమెతో పాటు వైఎస్సార్ సీపీ నాయకులు పోతు కాశీ, బళ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

బధిరుల సంస్థలో అడ్మిషన్ల స్వీకరణ

ఆత్రేయపురం: రాజమహేంద్రవరం స్వరాజ్యనగర్ వద్ద సంకల్పం సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలుకు బధిరుల ఆశ్రమ ప్రత్యేక సంస్థలో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్టు సంస్థ నిర్వాహకురాలు గంట కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు ఆమె మండల కేంద్రమైన ఆత్రేయపురంలో శనివారం తెలిపారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్య, హాస్టల్ సదుపాయం ఉన్నట్టు వివరించారు. తమ సంస్థలో బధిర పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 92907 17628కు సంప్రదించాలని చెప్పారు.

మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బొండాడ



బొండాడ రణదీప్ కుమార్

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు ప్రధాన కార్యదర్శిగా మామిడికుదురు మండలం నగరం గ్రామానికి చెందిన బొండాడ రణదీప్ కుమార్(టింకూ)ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు బొంతు మణిరాజ్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బొండాడ మాట్లాడుతూ మాల మహానాడును మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

కష్టపడితేనే ఉన్నత శిఖరాలు



డాక్టర్ రామచంద్రరావును సన్మానిస్తున్న అధ్యాపక బృందం

రావులపాలెం: కలలు కనండి, వాటిని సాకారం చేసుకోండని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్న మాటలను మననం చేసుకుని, విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను చేరవచ్చని రాజమహేంద్రవరం ప్రభుత్వ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ కె రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా, సమాజానికి ఉపయోగపడేలా జీవితాలను మలచుకోవాలన్నారు. మరో అతిథి కొత్తపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు ప్రతి విద్యార్థి సత్ప్రవర్తనతో మెలిగి, సమాజానికి మేలు చేయాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బీహెచ్ఎస్ మూర్తి, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్ అరుణ్‌కుమార్, అధ్యాపకులు సుభాషిణి, సోని, రజని, సుమలత, హరిబాబు, ప్రసాద్, శ్రీనివాస్, రాజేంద్ర, సిద్ధార్థ యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.